



సామర్లకోట భీమేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు

రైతులను భయపెడుతున్న 'సెన్‌యార్'!

- ఓవైపు వరిచేలలో మాసూళ్లు.. మరోవైపు కోతకు సిద్ధంగా చేలు
- వాతావరణ మార్పులతో కలవరం



గొల్లప్రోలులో పొలాల్లో ఉండిపోయిన కోసిన వరి పనలు

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):వాతావరణంలో మార్పులు.. పొంచిఉన్న 'సెన్‌యార్' తుఫాన్ రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి.సార్వా వరిమాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా, తర్వాత తుఫాన్‌గా మారే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు పంటను ఒబ్బిడి చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం జిల్లాలోని ఏలేరు, పీబీసీ, పంపా ఆయకట్టుతోపాటు మెట్ట, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వరికోతలు, మాసూళ్ల చురుగ్గా సాగుతున్నాయి. రైతులు కోతకు సిద్ధమైన పంటను యంత్రాల సహాయంతో మాసూళ్లు చేస్తుండగా కొందరు సాధారణ పద్ధతుల్లో కోసి వరికుప్పలు వేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. అల్పపీడనం నేపథ్యంలోనే ఈమార్పులు జరిగాయని అధికారులు చెప్తున్నారు. మాసూళ్లు పూర్తి చేసిన రైతులు ధాన్యం రాశులను హైవే వెంబడి, లేఅవుట్లు, ఖాళీ స్థలాల్లో ఆరబోసారు. వీటిని శుక్రవారం సాయంత్రం నుంచే లారీలు, ట్రాక్టర్ల ద్వారా రైసుమిల్లులకు తరలిస్తున్నారు.

ముగిసిన 'కార్తీకం'

- చివరిరోజున పోలి పాడ్యమి దీపాలు





పిఠాపురం పాదగయలో తెల్లవారుజామున పాడ్యమి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ అమలు చేయాలి

- డీఆర్‌వో వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రకారం ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాను 2022 ఓటర్ల జాబితాతో అనుసంధానించి సరిచూసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోగస్ ఓట్లను వేరు చేసి డేటాను సిద్ధంగా ఉంచాలన్నారు. ఆర్డీవో మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కాకినాడ కార్పొరేషన్ డీసీ శ్రీనివాసు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల పీజీఆర్ఎస్‌కు 11 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం కాకినాడ వివేకానంద హాలులో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి 11అర్జీలు వచ్చాయి. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగుల పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని డీఆర్‌వో వెంకట్రావు తెలిపారు.

శ్రీధర్‌కు కేఎస్ఈజెడ్ ఎఫ్ఏసీ బాధ్యతలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.శ్రీధర్‌కు కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటివరకు ఆ బాధ్యతలను నిర్వహించిన సమగ్ర శిక్ష కాకినాడ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రావు శ్రీకాకుళం బదిలీ అయ్యారు.

మొంథా తుఫాన్‌తో రహదారులకు తూట్లు

మళ్లీ గుంతలు!



కిర్లంపూడి మండలంలోని ఓ రహదారి దుస్థితి

- రోడ్లు అధ్వానం
- రాకపోకలకు అవస్థలు
- ప్రయాణికులు గగ్గోలు



సామర్లకోట ఏడీబీ రోడ్డులో ఇదీ దుస్థితి.. గొల్లప్రోలు-చెందుర్తి రోడ్డు, డి పోలవరంలో గుంతల రోడ్డు

పిఠాపురంరూరల్/సామర్లకోట/కోటనందూరు/రౌతులపూడి/కిర్లంపూడి/పెద్దాపురం/ప్రత్తిపాడు/కొత్తపల్లి-ఆంధ్రజ్యోతి : పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడే రోడ్డు గతుకులమయంగా ఉంది. ఐదేళ్లుగా ఈ మార్గంలో రాకపోకలకు సాగించే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. పిఠాపురం-సామర్లకోట ఆధ్యాత్మిక క్షేత్రాలకు, రైల్వేస్టేషన్‌కు, ఫ్యాక్టరీల్లో పనిచేసేందుకు రోజుకు వందల్లో వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో పలుమార్లు మరమ్మతులు చేపట్టి, మళ్లీ యథాస్థితికి రోడ్డు చేరుకుంది. కుమారపురం నుంచి జగ్గయ్యచెరువుకు వచ్చే మార్గంలో ఈ దుస్థితి నెలకొంది. సామర్లకోట నుంచి కందరాడ శివారు వరకు రోడ్డు నిర్మించి మిగిలిన రోడ్డు నిర్మాణం చేపట్టక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపల్లి మండలంలో ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు, గోర్స పండూరు, ఉప్పాడ వయా కొత్తపల్లి మీదుగా పిఠాపురం ఆర్‌అండ్‌బీ రహదారులకు అధికారులు మరమ్మత్తులు చేపట్టారు. కానీ, మొంథా తుఫాన్ ధాటికి కురిసిన వర్షాలకు ఆ రహదారులు అధ్వానంగా మారాయి. కెరటాల ఉధృతికి బీచ్‌రోడ్డు కోతకు గురైంది. జిల్లాలో ఐదు ప్రాంతాల నుంచి చేరుకునేందుకు సామర్లకోట కూడలి ప్రాంతం. కానీ, ఇక్కడకు చేరుకునే రోడ్లనీ ధ్వంసమయ్యాయి. సామర్లకోట-పిఠాపురం రోడ్డు, సామర్లకోట- పెద్దాపురం ఏడీబీ రోడ్డు, సామర్లకోట-కాకినాడ ఏడీబీ రోడ్డు, సామర్లకోట-బిక్కవోలు కెనాల్ రోడ్ల పరిస్థితి పెద్దపెద్ద గోతులతో, రాళ్ల లేచిపోయి, రోడ్డు సాగిపోయి ఎత్తుపల్లాలుగా మారి ప్రమాదభరితంగా మారాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో పిఠాపురం-సామర్లకోట మధ్య తాత్కాలిక మరమ్మతు పనులతోపాటు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారనుకునేలోపు పనులన్నీ నిలిపివేశారు. సామర్లకోట-బిక్కవోలు కెనాల్ రోడ్డు వర్షాలకు గోతులమయంగా మారింది. సామర్లకోట-రాజానగరం ఏడీబీ రోడ్డు విస్తరణ పనులే కాదు, రోడ్డు మరమ్మతు పనులు సైతం నత్తనడకతో నడుస్తున్నాయి. సామర్లకోట-అచ్చంపేట ఏడీబీ రోడ్డు ఇటీవల మరింత ప్రమాదభరితంగా మారింది. ఈ రోడ్డుకు ఉండూరు శివారున సాగరమాల రోడ్డును అనుసంధానం చేయడం, కొప్పవరం, అచ్చంపేట, తిమ్మాపురం కూడలి ప్రాంతాలను విస్తరించే పనులు చేపట్టడం వంటి అంశాలతో రోడ్డు అధ్వానంగా మారింది. పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దారిపోడువునా ఈ రహదారి గోతులమయంగా మారింది. గుర్రాల సెంటర్ నుంచి జె.తిమ్మాపురం వరకు వెళ్లే 8 కిలోమీటర్ల ఈ రహదారి మధ్యలో 120 చిన్న, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇక గొల్లప్రోలు- చెందుర్తి రహదారి పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది.

మెట్టలో ఇదీ పరిస్థితి..

తుని-నర్సీపట్నం రహదారి పూర్తిగా గోతుమయం కావడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారి గుండా కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి రహదారి నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. రౌతులపూడి నుంచి కత్తిపూడి, తేటగుంట వెళ్లే రహదారులపై పెద్దపెద్ద గోతులతో ప్రయాణికులు చాలా ఇబ్బందిపడుతున్నారు. కిర్లంపూడి-ప్రత్తిపాడు ప్రధాన రహదారి, వేలంక-పెద్దనాపల్లి రహదారి గోతులుమయంగా మారాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రత్తిపాడు మండలంలోని మెట్టిచింత-గోకవరం రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు రహదారులు సగం కోతకు గురయ్యాయి. పొదురుపాక, పోతులూరు, వెంకటనగరం రహదారులు కూడా దారుణంగా దెబ్బతిన్నాయి.

మత్స్యకారుల సుస్థిర జీవనోపాధికి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటు

- ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



మత్స్యకారులకు చెక్ అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కాకినాడసిటీ/సర్పవరంజంక్షన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సుస్థిర జీవనోపాధిని పెంపొందించేందుకు, మత్స్య సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థ(ఎస్ఐఎఫ్‌టీ)లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో 119 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతంతో 6 కోస్తా మండలాలు, 51 సముద్ర తీర మత్స్యకార గ్రామాలు ఉన్నాయన్నారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ షిప్పింగ్ హార్బర్‌ను ఆధునికీకరించేందుకు కావాల్సిన రూ.90కోట్ల నిధులను కేంద్రం నుంచి విడుదల చేసేందుకు కృషి చేస్తానన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా అందించే ఇంజన్‌లు వలలు, ఇతర వాహనాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఎగ్జిబిషన్‌ను ప్రజాప్రతినిధులు తిలకించారు. మత్స్యకార రంగంలో విశేష ప్రతిభ కనబరచిన మత్స్యకారులు, హేచరీల ప్రతినిధులు, బోటు ఓనర్లు, సొసైటీ యజమానులు, ఆక్వా రైతులు. మత్స్యశాఖ అధికారులకు అవార్డులు అందజేశారు.

సముద్రంలో 50వేల పండుగప్ప పిల్లలు



సముద్రంలోకి పండుగప్ప పిల్లలు వదులుతున్న ఎంపీ

మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వాకలపూడి ఫిషింగ్ హార్బర్ ఒకటో జెట్టీలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరంలతో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ 50వేల పండుగప్ప చేప పిల్లలను సముద్రంలో విడిచిపెట్టారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ డాక్టర్ అంజలి, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షుడు బలసాడి రంగారావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు కె.కరుణాకర్, లావణ్య, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు అనురాధ, రాజేంద్రరావు, డాక్టర్ గోపి, నూకరాజు, ఉమామహేశ్వరరావు, శ్రీరామకృష్ణ, కూటమి నాయకులు పెంకే శ్రీనివాస బాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీవోలు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

అమలుకు సిద్ధంగా 100 రోజుల ప్రణాళిక



- కోస్టల్ రీజైలెన్స్ పథకం ద్వారా ఉప్పాడ తీరంలో రక్షణ చర్యలు
- డిసెంబరులో కేరళ, తమిళనాడుల్లో మత్స్యకారుల సందర్శనకు ఏర్పాట్లు
- స్పీడ్‌బోట్, స్కూబా డ్రైవింగ్‌లో శిక్షణ
- మత్స్యకారుల భద్రతకు ప్రాధాన్యం
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకార సోదరులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల ప్రణాళికను అమలు చేసేందుకుగాను రోడ్‌మ్యాప్ తుది దశకు చేరుకుందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెల్లడించారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా శుక్రవారం మత్స్యకారులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. తీరాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు.తీరప్రాంతంలో అంతరించిపోతున్న మత్స్య సంపదను పెంపొందించడంతోపాటు వారికి ప్రత్యేక ఆదాయమార్గాల రూపకల్పనపై దృష్టి సారించామని, విశాఖ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి ఇనిస్టిట్యూట్, మత్స్యశాఖ సూచనల మేరకు ప్రత్యేక ప్రణాళిక అమలుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. కేంద్రం రీజైలెన్స్ పథకం ద్వారా ఉప్పాడ తీరప్రాంతంలో రూ2కోట్లతో రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఉప్పాడ, కోనపాపపేట ప్రాంతాల్లో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు ఆర్వోప్లాంటు ఏర్పాటు, చేపలు ఎండబెట్టుకునేందుకు మూడు ఫిష్ డ్రైయింగ్ ప్లాట్‌ఫామ్స్ నిర్మించనున్నట్లు చెప్పారు. వేటకు వెళ్లిన మత్స్యకారులను సముద్రంలో ట్రాక్ చేసేందుకు వీలుగా జీపీఎస్ సిస్టం ఏర్పాటుతోపాటు మత్స్యసంపదను నిల్వ చేసుకునేందుకు ఐస్‌బాక్సులు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. మత్స్యసంపద తగ్గిపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందుల గురించి మత్స్యకారులు వివరించారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 50వేల పండుగప్ప చేపపిల్లలను సముద్రంలోకి వదిలిపెట్టామని తెలిపారు. ఉప్పునీటిలో పెరిగే టైగర్ రొయ్యిలను త్వరలోనే తీరప్రాంతంలో విడిచిపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. తీరప్రాంతంలో డీప్‌ఫిషింగ్‌కు అనుమతులు వచ్చినట్లు తెలిపారు. తీరప్రాంత మత్స్యకారులకు ఇప్పటి వరకూ 12 నాటికల్ మైళ్ల వరకూ మాత్రమే వేటకు అవకాశం ఉండేదని, ఇటీవల కేంద్ర దాన్ని 200నాటికల్ మైళ్ల వరకూ పెంచిందని చెప్పారు. దీనివల్ల మత్స్యకారులకు ట్యూనా చేపలు దొరికే అవకాశం ఉంటుందన్నారు.

తీరప్రాంతంలో టూరిజం హాట్‌స్పాట్లు

తీరప్రాంతంలో మత్స్యకారులకు వేటతోపాటు ఇతర మార్గాల్లో ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పవన్‌కల్యాణ్ తెలిపారు. కేరళ తరహాలో తీరప్రాంత పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పీడ్ బోటింగ్, స్కూబా డైవింగ్ తదితర జలక్రీడల్లో మత్స్యకార యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కాకినాడ తీరప్రాంత మత్స్యకారులను కేరళ తీసుకువెళ్లి అక్కడ మత్స్యకారులు నిర్వహిస్తున్న ఎకోటూరిజం స్పాట్ల వద్ద శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. చెన్నై హార్బర్ సమీపంలో తిరువత్రియూర్ కుప్పం తీరంలో విజయవంతంగా నిర్వహిస్తున్న కృత్రిమ రీఫ్ కల్చర్ సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 1500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టన్ను సామర్థ్యం గల కృత్రిమ రీఫ్‌లను సముద్రంలో ఉంచడం ద్వారా 300 రకాల సముద్రపు జీవులను ఆకర్షించవచ్చునని, ఇందులో కనీసం 50 రకాలు వాణిజ్య విలువ కలిగినవి ఉంటాయని వివరించారు. డిసెంబరు 2వ వారంలో మన ప్రాంత మత్స్యకారులను కేరళ, తమిళనాడుకు పంపబోతున్నట్లు వెల్లడించారు. మత్స్యకారులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని పవన్ స్పష్టం చేశారు.

నగదు రహితమే

లక్ష్యంగా..



జాతీయ, రాష్ట్ర రహదారులపై గల టోల్ ప్లాజాల వద్ద టోల్‌ఫీ చెల్లింపులన్నీ నగదు రహితంగా సాగాలన్న లక్ష్యంతో సమూల మార్పులు చేస్తున్నారు. టోల్‌ఫీ చెల్లింపులు ఫాస్టాగ్ ద్వారానే జరిగేలా ప్రోత్సహిస్తూనే నగదు చెల్లిస్తే రెట్టింపు చార్జీలు చెల్లించే విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. ఇప్పుడు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుందని నేషనల్ హైవే అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వార్షిక పాస్‌లను అమల్లోకి తెచ్చింది.



- టోల్‌ప్లాజాల వద్ద టోల్‌చార్జీల చెల్లింపులో మార్పులు
- ఫాస్టాగ్ ఉంటే సాధారణ చార్జీలే
- నగదు చెల్లిస్తే 100 శాతం అదనం
- యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే 25 శాతమే అదనం
- ఇప్పటికే అమల్లోకి వార్షిక పాస్‌లు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని-రాజమహేంద్రవరం మధ్యలోని కాకినాడ జిల్లా కృష్ణవరం, దివాన్‌చెరువు-సిద్ధాంతం మధ్యలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈతతోట వద్ద టోల్‌ప్లాజాలు ఉండగా, 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి-కాకినాడ బైపాస్ మధ్యలో గొల్లప్రోలు వద్ద, గురజనాపల్లి-పాశర్లపూడి మధ్యగల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవన్నీ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధీనంలో ఉన్నాయి. దీంతోపాటు తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద, నల్లజర్ల మండలం వీరవల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ అధీనంలో ఉన్నాయి. వీటి ద్వారా ప్రయాణాలు సాగించే అన్నిరకాల కార్లు, వ్యాన్‌లు, ఫోర్‌వీలర్ ఆటోలు, లారీలు, బస్సులు, ట్రాలీలు, ఇతర భారీ వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలను నేషనల్ హైవే అథారిటీ నిర్ణయిస్తుంది. సాధారణంగా రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయానికి అనుగుణంగా ఈ చార్జీలను నిర్ణయించి వసూలు చేస్తారు.

ఫాస్టాగ్ లేకుంటే 100 శాతం అదనం

టోల్‌ప్లాజా ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి అక్కడ అమల్లో ఉన్న టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా దాటే సమయంలో ఆటోమెటిక్‌గా వాహనానికి చెందిన ఫాస్టాగ్ ద్వారా ఈ రుసుం కట్ అవుతుంది. ఒకవేళ ఫాస్టాగ్ ఖాతాలో సొమ్ములు లేకున్నా, వాహనానికి అసలు ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుంకంటే 100 శాతం అదనంగా చెల్లించాలి. నగదు చెల్లింపులు చేసేవారికి 24 గంటల వ్యవధిలో రాకపోకలు పూర్తిచేసి టోల్‌ను దాటితే టోల్‌ఫీజు చెల్లింపులో ఉన్న రాయితీలు వర్తించవు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇదే విధానం అమలవుతోంది.

యూపీఐ ద్వారా చెల్లిస్తే..

ఫాస్టాగ్‌లో నగదు లేకున్నా, అసలు వాహనానికి ఫాస్టాగ్ లేకున్నా ఇప్పటివరకూ వాహనదారులు నగదు రూపంలోనే 100శాతం అదనంగా టోల్‌గేటుల వద్ద ఫీజులు చెల్లించాల్సి వచ్చేది. ఈ విధానంలో మార్పులు తెస్తూ కేంద్రం జారీ చేసిన సూచనలకు అనుగుణంగా నేషనల్ హైవే అథారిటీ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఫాస్టాగ్ లేని వాహనదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే టోల్‌ఫీజుకు అదనంగా 25 శాతం చెల్లిస్తే సరిపోతుంది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని నవంబరు 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. నగదు చెల్లిస్తే మాత్రం 100శాతం బాదుడును వాహనదారులు భరించాల్సి ఉంటుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి టోల్‌గేటుల వద్ద ఫీజుల చెల్లింపులు నగదు రూపంలో జరగకూడదనేది కేంద్రం లక్ష్యమని హైవే అథారిటీ అధికారి ఒకరు తెలిపారు.

వార్షిక పాస్‌లకు ఆదరణ

ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుం చెల్లించేలా కేంద్రం తీసుకువచ్చిన నూతన విధానానికి వాహనదారులు నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌కోసం ఏడాది కాలానికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫాస్టాగ్ రీచార్జి ఏడాది కాలానికి అమలులో ఉంటుంది. ఇలా రీచార్జి చేయించిన వాహనం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై గల ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200సార్లు ప్రయాణించే అవకాశం ఉంది. ఏడాది లేదా 200సార్లు ఏదిముందైతే దాన్ని పరిగణలోకి తీసుకుంటారు. కార్లు, జీపులు, వ్యాన్‌లు వంటి వ్యక్తిగత అవసరాల నిమిత్తం తిరిగే వాహనాలకే ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌ను వర్తింపజేశారు. వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు ఇది వినియోగించుకునే అవకాశం ఉండదు. రాష్ట్ర రహదారులు, ఇతర ప్రాంతాల్లోని టోల్‌గేట్‌ల వద్ద మాత్రం సాధారణ పద్ధతిలో ఫాస్టాగ్ ద్వారా టోల్‌ఫీ చెల్లించాల్సి ఉంటుంది. ఫాస్టాగ్ లేనివారు చాలావరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు.

'రబీ'లో 1,90,865 ఎకరాలకు సాగునీరు

- సాగునీటి సలహా మండలి సమావేశంలో కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తగినంత నీటి లభ్యత ఉన్నందున రబీ సీజన్‌కు జిల్లాలో గోదావరి తూర్పు డెల్టా, పిఠాపురం బ్రాంచి కెనాల్, ఏలేరు పరిధిలో 1,90,865 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి డెల్టా కింద 1,05,341 ఎకరాలు, పిఠాపురం బ్రాంచి కెలాల్ కింద 32,507 ఎకరాలు, ఏలేరు కింద 53,017 ఎకరాలు కలిపి మొత్తంగా 1,90,865 ఎకరాలకు సాగునీరు ఇస్తామన్నారు. డిసెంబరు నుంచి ప్రారంభమయ్యే రబీ సీజన్‌లో ఈ ఆయకట్టులో రైతులు డిసెంబరు 31నాటికి నాట్లు వేసుకోవాలన్నారు. 2026, మార్చి 31నాటికి పంటలను పూర్తి చేసుకోవాలన్నారు. ఇటీవల మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న కాలువలను మరమ్మతు చేయాలన్నారు. జిల్లాలో 50 మైనర్ ఇరిగేషన్ చెరువులను ఆర్ఆర్ఆర్ పథకం కింద గుర్తించి నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపామన్నారు. రబీ సీజన్‌లో నీరు విడుదల చేసే ముందు ఏలేరు కాలువలకు పడిన గండ్లు పనులు పూర్తి చేయాలన్నారు. గేట్లు, కాలువ గట్లు, కాలువలకు పూడిక తీతలు, గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టి శివారు ప్రాంతాల్లో ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయాలన్నారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి ఎఫ్‌డీఆర్ వర్కులు, నావిగేషన్ లాకులు, లస్కర్ల జీతాలు, నీటి తీరువ పన్నులు వంటి వాటి స్థితిగతులపై గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ సునీల్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌రావు, ఎంపీ ఉదయ్‌శ్రీనివాసు, ఎమ్మెల్యేలు చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పంతం నానాజీ, వనమాడి కొండబాబు,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, సివిల్ సప్లయిస్ చైర్మన్ తోట సుధీర్, మాజీ ఎమ్మెల్యే వర్మ, ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ నాగేంద్ర, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి,జేడీ విజయ్‌కుమార్, ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.



ఏజెన్సీలో ఎర్ర బియ్యం

'తూర్పు' మన్యంలో రెడ్ రైస్ సాగుకు శ్రీకారం

(కూనవరం-ఆంధ్రజ్యోతి)

ఎర్ర బియ్యం... దీనిని ఇప్పటివరకు కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే పండించేవారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేవలం 600 మంది రైతులు ఈ పంటను పండిస్తున్నారు. ఇప్పుడు దీనిని ఏజెన్సీ ప్రాంతమైన అల్లూరి జిల్లా కూనవరంలోనూ సాగు చేస్తున్నారు. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన రైతు గోళ్ల సత్యనారాయణ ఎర్ర బియ్యం సాగుకు శ్రీకారం చుట్టాడు. విత్తనాలను ఆన్‌లైన్‌లో తెప్పించిన ఈయన తన పొలంలో నాటాడు. సాధారణ వరి రకాలు దిగుబడి 120 రోజుల్లో వస్తే ఈ పంటకు 135 రోజులు పడుతుంది. తెల్ల బియ్యం కంటే ఎర్ర బియ్యంలో పౌష్టికాహార గుణాలు ఎక్కువ. విటమిన్ బీ1, బీ2, బీ6లతో పాటు మాంగనీస్, కాల్షియం, సోడియం, జింక్, ఐరన్ లాంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. క్యాన్సర్


కంకుల దశలో ఉన్న పంట

కణాలను తగ్గించడంలో ఈ ఎర్ర బియ్యం ఎంతో దోహదపడతాయి. మధుమేహాన్ని నివారించడంలోను, బీపీ తగ్గించగల సామర్థ్యం కూడా ఎర్ర బియ్యంలో ఉన్నాయి. ఇన్ని పోషకాహారాలు ఉన్న ఈ పంటను ప్రస్తుతం ఒక ఎకరం భూమిలో సాగు చేస్తున్నానని, హెక్టారుకు ఆరు టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పాడు.


రెడ్ రైస్ పంటను పరిశీలిస్తున్న రైతు సత్యనారాయణ

చిన్నారులను దత్తత తీసుకోవాలని... వారితో అమ్మ, నాన్న అని పిలిపించుకోవాలని చాలా మంది ఆరాటపడతారు. పిల్లలను పెంచుకోవడానికి ఆసక్తి చూపుతారు. అయినప్పటికీ సంతాన భాగ్యం లేక ఆవేదనతో ఉండే వారు సమాజంలో మరికొందరు ఉంటారు. పిల్లలను పెంచుకోవాలని ఉన్నవారు కొందరు దళారులను ఆశ్రయిస్తుంటారు.



అనాథలుగా మారిన పిల్లలు కూడా సమాజంలో కనిపిస్తుంటారు. పిల్లలను కని నడి రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయే మానవత్వం లేని తల్లిదండ్రులు అక్కడక్కడా ఉంటారు. రోజుల వ్యవధిలో ఉన్న చిన్నారులను సైతం రోడ్డుపై వదిలేస్తుంటారు. అలాంటి వారిని చేరదీసి శిశుగృహ సంరక్షణలో ఉంచుతారు శిశుగృహ అధికారులు. వారిని చట్టబద్ధంగా దత్తత ఇస్తూ.. వారికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు.

దత్తతకు వేళాయె

- అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న మహిళా-శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం అధికారులు
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంల్లో 'శిశుగృహ'ల నిర్వహణ



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ చట్టబద్ధంగా తీసుకోవడం ఒక వరం. అలాంటి చట్టబద్ధత దత్తతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను బాలల పరిరక్షణ విభాగం, మహిళా, శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్నాయి. దత్తతలో ఉండే వివిధ రకాలైన వెసులుబాట్లు రిలేటివ్ అడాప్షన్ (రక్త సంబంధీకుల దత్తత), స్టెప్ పేరెంటెడ్ ఆప్షన్ తదితర అంశాలపై బాలల పరిరక్షణ సిబ్బంది అవగాహన కల్పించనున్నారు. నవంబరు మాసం అంతా గ్రామ, మండల, డివిజనల్ స్థాయిల్లో దత్తత ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఎలా దత్తత తీసుకోవచ్చంటే...

మొదటి దశ: ముందుగా పాన్‌కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. బిడ్డను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు తమ పాన్ కార్డుతో కారా (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఏఆర్ఏ.ఎన్ఐసీ.ఇన్) వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రసీదు ప్రింటు తీసుకోవాలి.

రెండో దశ:
(ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయడం)
- ఫ్యామిలీ ఫొటో (2 ఇంటు 3),
- నివాస ధ్రువీకరణ పత్రం: ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీ కార్డులు, పాస్‌పోర్టు, కరెంట్ బిల్లు
- ఆదాయ ధ్రువీకరణ పత్రం: సంవత్సర ఆదాయపత్రం, తహసీల్దారు నుంచి ధ్రువీకరణ.
- వివాహ ధ్రువీకరణ పత్రాన్ని రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి తీసుకురావాలి.
- దత్తత తీసుకోబోయే వారి జనన ధ్రువీకరణ పత్రాలు/నోటరీ నుంచి పుట్టిన తేదీ అఫిడవిట్
- తల్లిదండ్రులు ఇద్దరి మెడికల్ టెస్టులు విడివిడిగా ఇవ్వాలి. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాలి.

మూడో దశ:
హోమ్ స్టడీ (గృహ అభ్యసన రిపోర్ట్)

హోమ్ స్టడీ సమయంలో అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలతో ఏదైనా జాతీయ బ్యాంకులో రూ.6వేలు డీడీ తీసి పథక సంచాలకులు, జిల్లా మహిళ, శిశు అభివృద్ధి సంస్థ, కాకినాడ వారికి దరఖాస్తు సమర్పించాలి.

చివరి దశ:
(దత్తత తీసుకోవడం)
- బిడ్డను దత్తత తీసుకునే సంస్థ వారికి రూ.50వేలు డీడీ రూపంలో అందించాలి.
- దత్తత నిర్ధారణ కోసం జిల్లా ఫ్యామిలీ కోర్టుకు బిడ్డను దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో కలిసి హాజరుకావాలి. బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం దత్తత తీసుకున్న జిల్లా మున్సిపల్ కార్యాలయం ద్వారా తల్లిదండ్రులకు అందజేస్తారు. దత్తత తీసుకున్న తర్వాత ఆరు నెలలకు ఒకసారి, రెండు సంవత్సరాల పాటు గృహ విచారణ సమయంలో రూ.2వేలు డీడీ రూపంలో ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి పథక సంచాలకులు, జిల్లా మహిళ, శిశు అభివృద్ధి సంస్థ, కాకినాడ వారికి సమర్పించాలి.
- చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకున్న వారికి మూడు నుంచి ఏడు సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా.... ఒక్కోసారి రెండూ విధించే అవకాశం ఉంది.



చిన్నారుల దత్తతపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్న కాకినాడ జిల్లా ఐసీడీఎస్, బాలల పరిరక్షణ విభాగం అధికారులు


ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కాకినాడ కరణం గారి సెంటర్లో నిర్వహిస్తున్న శిశుగృహ

కాకినాడ జిల్లాలో 2010 నుంచి ఇప్పటివరకు సుమారు 87 మంది చిన్నారులను దత్తత ఇచ్చినట్టు శిశుగృహ ఇన్‌చార్జి మేనేజరు లక్ష్మీరేవతి తెలిపారు. వీరిలో 14 మంది చిన్నారులను ఇతర దేశాల దంపతులకు దత్తత ఇచ్చినట్టు ఆమె 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇంకా నలుగురు చిన్నారులు శిశుగృహ మందిరంలో సంరక్షణ పొందుతున్నారు.

దత్తత కావాల్సి వస్తే...

దత్తతకు సంబంధించిన మరింత సమచారం కావాలంటే దగ్గరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కానీ, ఐసీడీఎస్ అధికారులను కానీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, రూమ్ నెం: 201, మోర్ సూపర్‌మార్కెట్‌పైన రెండో అంతస్తు, కరణంగారి సెంటర్, కాకినాడలో సంప్రదించవచ్చు. ప్రాజెక్టు డైరెక్టర్ మొబైల్: 8639140672, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మొబైల్: 8555060818, శిశుగృహ మేనేజరు మొబైల్ :8919123488 సంప్రదించాలి.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాసులకు పిల్లల దత్తతకు సంబంధించిన సమచారం కోసం సంప్రదించాల్సిన చిరునామా... స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ డోర్ నెం: 12-2-247/ ఎంఐజీ 27, ఫ్లాట్ నంబర్ 01, ఏపీహెచ్‌బీ కాలనీ, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో, ఎర్రవంతెన దగ్గర, అమలాపురం. మొబైల్: 9640852688

తూర్పుగోదావరి జిల్లా వాసులకు పిల్లల దత్తతకు సంబంధించిన సమాచారం కోసం రాజమహేంద్రవరంలోని ఆర్డీవో ఆఫీసు ఎదురుగా ఉన్న శిశుగృహ మందిరంలో సంప్రదించవచ్చు. 8328544610 నెంబరుకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఒక బాలుడు మాత్రమే దత్తతకు సిద్ధంగా ఉన్నాడు. దృష్టిలోపం సమస్యతో ఉన్న అతడికి త్వరలోనే ఆపరేషన్ చేయించి, ఆ తర్వాత దత్తత ప్రక్రియ చేపడతామని శిశుగృహ ఇన్‌చార్జి చెప్పారు.

వాడపల్లి వెంకన్న కార్తీకం ఆదాయం రూ.5.51 కోట్లు


ఆలయానికి పోటెత్తిన భక్తులు (ఫైల్)

ఆత్రేయపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామికి కార్తీక మాసం నెల రోజుల పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ ఏడాది వివిధ సేవల ద్వారా రూ.5,51,55,734 ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. గత ఏడాది రూ.4,75,63,429 ఆదాయం లభించగా, ఈ ఏడాది రూ.75,92,305 అధిక ఆదాయం వచ్చిందన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మెరుగైన ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 7,170 మంది దరఖాస్తు

పెద్దాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికిఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 7170 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 13న మొత్తం 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను navodaya.gov.in, cbseitms.nic.in సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవలసి ఉంటుందని, హాల్ టికెట్ డౌన్లోడ్ చేసే సమయంలో అభ్యర్థి రిజిస్ట్రేషన్ నెంబర్‌ను యూజర్ ఐడీ గాను, అభ్యర్థి పుట్టిన తేదీని పాస్వర్డ్ గాను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

పులిహోరతో వేంకటేశ్వరస్వామి


పులిహోరతో తీర్చిదిద్దిన స్వామివారి రూపం

ధవళేశ్వరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ సందర్భంగా శుక్రవారం పులిహోర, పువ్వులతో స్వామి రూపాన్ని రూపొందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

- ఝుటాఝూట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు
- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), అంజిబాబు, రాజగోపాలశర్మ, వెంకన్న, వినయ్ విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వర స్వామికి వెండి ఝుటాఝూటం, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష అలంకరణ చేయగా భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణిల్లో అరటి డొప్పల్లో నేతి దీపాలు వదిలి కార్తీక మాసానికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టీడీపీ నేతలు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), సభ్యులు చీమలకొండ ప్రసాద్, కొండపల్లి సత్య వాణి, కంచర్ల సుష్మామోహిని, గూనపాటి బుల్లెమ్మ భక్తులకు సేవలందించారు. సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. సామర్లకోటకు చెందిన మిరియాల కుటుంబీకుల వీరభద్రుని సంబరం, మహిళా భక్త సమాజంచే కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి.


వెండి ఝుటాఝూట అలంకరణలో కుమారరామ భీమేశ్వరస్వామి

ఫార్మా ఫ్యూజన్-2కే 25 ప్రారంభం

- జేఎన్‌టీయూకేలో నిర్వహణ
- జ్యోతి ప్రజ్వలన చేసిన వీసీ ప్రసాద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ కృష్ణమోహన్

జేఎన్‌టీయూకే (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు వేదికగా ఫార్మా ఫ్యూజన్ 2 కే 25 నిలుస్తుందని జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్-ఐఎస్‌టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఫార్మా ఫ్యూజన్-2కే 25ను శుక్రవారం వీసీ ప్రసాద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ డీ. కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిభ, విజ్ఞానం,


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

పరిశోధనాభావం, సృజనాత్మకతకు పదునుపెట్టే విధంగా వినూత్నంగా ఆలోచించి ముందుకు సాగాలని కోరారు. పలు అంశాలపై ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. మైసూర్ జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రొ-ఛాన్సలర్, మాజీ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ బి.సురేష్ వర్చువల్‌గా పాల్గొని ఫార్మసీ రంగంలో కృత్రిమ మేధస్సు పాత్రపై విలువైన ప్రసంగం చేశారు. ఫార్మా పరిశోధన, ఔషధ ఆవిష్కరణ, క్లినికల్ డేటా విశ్లేషన, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధస్సు మార్గదర్శక మార్పులు తీసుకువస్తుందని వివరించారు. ఏయూ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్స్ సైన్సెస్ ప్రిన్సిపాల్ జి.గిరిజాశంకర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.నాగమణి, ఐఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.భవానీ పాల్గొని తగిన సూచనలు చేసి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వివిధ ఫార్మా, ఇన్నోవేటివ్ స్టాల్స్‌ని ప్రదర్శించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ కాలేజీలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజైన శనివారం లైఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్ నిపుణుడు డాక్టర్ వై.మోహన్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని విద్యా ర్థులతో తమ అనుభవాలను పంచుకుంటార న్నారు. ప్రదర్శించిన పలు అంశాలను పరిశీలిస్తారని కార్యక్రమ నిర్వాహకులు చెప్పారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నిఖిల్ ఎంపిక

దివాన్‌చెరువు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థి కోట నిఖిల్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు రాజానగరం మండలం పాతతుంగపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కమలదాస్ శుక్రవారం తెలిపారు. పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు పార్థసారథి మాట్లాడుతూ కాకినాడలో ఇటీవల జరిగిన జిల్లా


ఎంపికైన నిఖిల్‌తో పాతతుంగపాడు ఉన్నత పాఠశాల హెచ్ఎం, తదితరులు

స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో నిఖిల్ పాల్గొని ప్రతిభ కనబరిచాడన్నారు. విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.. ఈ నెల 23వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం కలిగిన యువకులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. గోపీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పెంటర్లు, స్టీల్ ఫిక్సర్లు, పేవింగ్ స్టోన్ వర్కర్స్, రోడ్డు వర్కర్ వంటి వృత్తుల్లో నైపుణ్యం ఉన్నవారికి ఉపాధి కల్పించేందుకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ అర్హతతో పాటు కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండాలని, గరిష్ఠ వయస్సు 44 సంవత్సరాలు మాత్రమేనని చెప్పారు. జర్మనీలో నెలకు సుమారు రూ.2.57 లక్షల జీతంలో ఎనిమిది నెలల కాంట్రాక్ట్ పై నియామకాలు జరగనున్నాయి. వసతి, వీసా, ఫ్లైట్ చార్జీలు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు ఎంప్లాయర్ భర్తిస్తారని పేర్కొన్నారు. అయితే భోజనం, ట్రాన్స్‌పోర్టేషన్ ఖర్చులు అభ్యర్థులే చూసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు చెల్లించవలసిన ప్రాసెసింగ్ ఫీజు రూ.2 లక్షలు, జీఎస్టీ కలిపి, రెండు విడతల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పాస్ పోర్ట్, రిలీవింగ్ లెటర్, విద్యా సర్టిఫికెట్లు తప్పనిసరి అని సూచించారు. ఈనెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే https: //naipunyam.ap.gov.in/user-registration?page=program-registration నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335, 9966291339, 8500885866 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని గోపీకృష్ణ సూచించారు.

రేపు అనపర్తిలో మెగా జాబ్‌మేళా

- వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొంటారన్నారు. ఈ నెల 29న కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. గత పది రోజులుగా నిర్వహించిన జాబ్‌మేళాల్లో 250 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి తమిళనాడు ఓసూర్‌లో ఉన్న టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు లభించాయన్నారు. నెలకు రూ.19 వేలు జీతంతో పాటు వసతి, భోజనం సౌకర్యాలను టాటా సంస్థ కల్పించిందన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగోన్నతులు

- డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రామ సచివాలయాల అధికారులుగా పంచాయతీ కార్యదర్శుల నియామకం... ఉత్తర్వులు జారీ

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల జాతర ప్రారంభమైంది. ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు లభించింది. తాజాగా ప్రభుత్వం సీనియర్ సహాయకులకు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగానూ, గ్రామ సచివాలయాల అధికారులుగాను పదోన్నతులు కల్పించింది. జోన్-2 పరిధిలోని 159 మంది తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ అంబేడ్కర్ జిల్లా, ఏఎస్ఆర్ జిల్లాలకు చెంది పంచాయతీలలో గ్రేడ్-1 కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి పదోన్నతులు కల్పించింది. వీరిలో కొందరిని కాకినాడ జిల్లాకు కేటాయించగా మరి కొందరిని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఏఎస్ఆర్ జిల్లాలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేసారు. వీరు ఆయా మండలాల పరిధిలో గ్రామ సచివాలయాల ప్రత్యేక అధికారులుగా నియామకం కానున్నారు. జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారులుగా 3టైర్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 660 మందికి పదోన్నతులు లభించగా జోన్-2 పరిధిలో 159 మందికి పదోన్నతులు లభించాయి. సామర్లకోట మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కొర్ల బుల్లియ్యకాపును ఏఎస్ఆర్ జిల్లా గ్రామ సచివాలయ అధికారిగా పదోన్నతి పొందారు. అలాగే వీకెరాయపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వై. శ్రీహరిని కాకినాడ జిల్లాలోనే గ్రామ సచివాలయ అధికారిగా పదోన్నతి పొందారు. అలాగే కాకినాడ జిల్లాకు వీజేవీ రమణ, ఎస్.శ్రీనివాసులు, సీహెచ్ వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి నుంచి కాకినాడ జిల్లాకు కెవీఎం. నారాయణరావు, పీహెచ్ ఎస్ఎస్ఎన్. రాజు, కెవీఎం.నారాయణరావు, కె. శ్రీనివాసు, జీ. ఉషారాణి, బొర్రు శిరీష, జలాల్ మహ్మద్, ఎండీవీ.రమణారెడ్డి, కర్రి శ్రీనివాసరావు, పినిశెట్టి వీరభద్రరావు, సావలం చినవెం కమ్మ, సీహెచ్ బాలబ్రహ్మాజీ, డి.శశికుమార్, సామర్లకోట ఈటీసీలో పనిచేస్తున్న తుమ్మల ఎల్ఎన్ కుమార్‌రాజా, సత్తి శ్రీనివాస రెడ్డి తదితరులు పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు.

శివోహం

కార్తీకమాసం ముగిసింది. నెలంతా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించిన భక్తులు చివరిరోజు అంతే భక్తిని కనబరిచారు. దీంతో శైవక్షేత్రాలన్ని, శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం పోలిస్వర్గం(పోలిపాఢ్యమి) సందర్భంగా శివోహం అంటూ ఆవు నెయ్యితో అరటిదొప్పల్లో వెలిగించిన దీపాలను గోదావరి, చెరువులు, కాలువలు, కోనేరుల్లో వదిలారు.





రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్‌లో సూర్యుడికి నమస్కరిస్తున్న మహిళలు



పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్‌లో దీపాలు వదులుతున్న భక్తులు



దీపాల వెలుగులో పిఠాపురం పాదగయ పుష్కరిణి



పుష్కర్‌ఘాట్‌లో భక్తితో నమస్కరిస్తున్న బాలుడు..





సాదాసీదాగా జడ్పీ స్థాయి సంఘాల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం సాదాసీదాగా సాగింది. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో శుక్రవారం 1,2,4,7 స్థాయి సంఘాల సమావేశాలు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగాయి. వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన 3వ స్థాయి సంఘ సమావేశం, వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన 6వస్థాయి సంఘ సమావేశం, జడ్పీటీసీ రొంగల పద్మావతి అధ్యక్షతన 5వస్థాయి సంఘ సమావేశం జరిగాయి. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముందుగా జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు ఉమ్మడి జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్షించారు. అనపర్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తిలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జిల్లా పరిషత్‌కు చెందిన కొంతస్థలం కేటాయిస్తే తాగునీటి ప్రాజెక్టు కల్పించగమని, అందువల్ల వాటర్ గ్రిడ్‌లకు ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్చంపేట సెంటర్ నుంచి సర్పవరం మీదుగా ఉప్పుటేరు వరకు ఆక్రమణలకు గురైన పంట కాలువను పునరుద్ధరిస్తే కాకినాడను ముంపు బారి నుంచి కాపాడవచ్చన్నారు. రాజానగరం ఎమ్మెల్యే నియోజకవర్గంలోని సమస్యలను ప్రస్తావించారు. ఆయాస్థాయి సంఘాల సమావేశాల్లో ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, జాతీయ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి అంశాలపై ఇప్పటి వరకు జరిగిన పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనుల వివరాలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో జీఎస్ రాంగోపాల్, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..

గోగన్నమఠంలో పడవ పోటీలు
ఉత్సాహంగా పాల్గొన్న మత్స్యకార యువకులు



గోగన్నమఠం వైనతేయ నదిలో వెళ్తున్న పడవలు

మామిడికుదురు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామంలో నిర్వహించిన పడవ పోటీలు హోరాహోరీగా జరిగాయి. సుమారు 80కు పైగా పడవలు పాల్గొన్నాయి. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పోటీల్లో మత్స్యకార యువకులు, పెద్దలు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. గోగన్నమఠం రేవు నుంచి పాశర్లపూడిలంకలోని రెబ్బనపల్లి రేవు వరకు నాలుగు కిలోమీటర్లు మేర నిర్వహించిన ఈ పోటీలను తిలకించడానికి స్థానికులు భారీగా తరలివచ్చారు. మొదటిస్థానంలో పెసంగి భైరవస్వామి (రూ.5వేలు), ద్వితీయస్థానంలో కాటాడి మీరా సాహెబ్(రూ.3వేలు), తృతీయ స్థానంలో కాటాడి సత్యనారాయణ (రూ.2వేలు) నిలిచి బహుమతులుగా గెలుచుకున్నారు. ఈ పోటీలను చింతా శ్రీనివాస్, అర్ధాని శ్రీనివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టా నరసింహమూర్తి, జె.సత్యనారాయణ, పి.వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కేశవరం రైల్వే గేటు వద్ద ట్రాక్‌పై వాహనదారులు
గమనించి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆపివేసిన లోకోపైలెట్



కేశవరంలో రైల్వేట్రాక్‌పై నిలిచిపోయిన రత్నాచల్ రైలు, వాహనదారులు

మండపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం రైల్వే గేటు వద్ద త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అసలు ఏం జరిగిందంటే... విజయవాడ నుంచి విశాఖ వైపు వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఉదయం 9 గంట లకు కేశవరం రైల్వే గేటు వద్దకు చేరు కుంటుండగా రైల్వే గేటు వేసి ఉన్నప్పటికీ ట్రాఫిక్ రద్దీ కార ణంగా పలువురు వాహనదారు లు ట్రాక్ మధ్యలో ఉండిపోయారు. ఆ సమయంలో ప్రజలను గమనించిన లోకోపైలెట్ రైలు ను 5 నిమిషాల పాటు నిలుపుదల చేశాడు. గేటుకు అర కిలోమీటరు ముందే నిలుపుదల చేసి పెను ప్రమాదం జరగకుండా కాపాడాడు. ఒకవేళ గమనించపోతే ప్రమాదం జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోవల్సి వచ్చేది. దీంతో లోకో పైలెట్‌ను ప్రజలు అభినందించారు. ట్రాఫిక్ క్లియర్ అయిన తర్వాత రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విశాఖకు బయలుదేరింది.

పోలీస్ జాగిలం అర్జున్ మృతి

కాకినాడ ఎస్పీ తీవ్ర దిగ్భ్రాంతి



అర్జున్‌కు సెల్యూట్ చేస్తున్న కాకినాడ ఎస్పీ

కాకినాడ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ జాగిలం (స్నిఫర్ డాగ్) అర్జున్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. అర్జున్ మృతి పట్ల కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అర్జున్‌కు ఘన నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్‌శాఖకు అర్జున్ 13 ఏళ్ల పాటు నిబద్ధతతో సేవలందించిందన్నారు. గతేడాది మే 17న ఉద్యోగ విరమణ పొందిందని, అయినా ఇంకా సేవలందిస్తోందన్నారు. యూనిట్‌లో పనిచేసిన కాలమంతా అత్యున్నత నిబద్ధత, అలర్ట్‌నెస్, క్రమశిక్షణ ప్రదర్శించిందన్నారు. వివిధ ఆపరేషన్లు, శోధనా కార్యక్రమాల్లో, ప్రమాద నివారణా విధుల్లో సమర్థవంతంగా పనిచేసిందన్నారు. తన స్నిఫింగ్ సామర్థ్యంతో యూనిట్ కార్యకలాపాలకు ముఖ్యమైన సహకారం అందించందని, అర్జున్ మరణం జిల్లా పోలీస్‌శాఖకు తీరని లోటని తెలిపారు.

టీచర్ దుర్మరణం



జ్యోత్స్నబాయి (ఫైల్)

తుని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని బ్యాంక్ కాలనీకి చెందిన ఉపాధ్యాయురాలు జ్యోత్స్నబాయి (47) దుర్మరణం చెందారు. విశాఖ జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం రాజానగరం లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమె పని చేస్తున్నారు. స్కూల్ ఆవరణలో బిల్డింగ్ పను లు జరుగుతుండగా స్లాబ్ వేసే క్రమంలో కాంక్రీట్ మోసుకెళ్లే ఐరన్ బక్కెట్ తెగి ఉపాధ్యాయురాలిపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆమెకు భర్త రెండేళ్ళ క్రితమే గుండెపోటుతో మృతిచెందాడు. భర్త మరణం అనంతరం అత్తగారు, పిల్లలతో కలిసి తుని బ్యాంక్ కాలనీలో ఉంటున్నారు.

బాలికను మోసం చేసిన వ్యక్తికి కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

కిర్లంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని మోసం చేసిన వ్యక్తికి ఏడాదిపాటు రోజూ 2 గంటలు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధించినట్లు జగ్గంపేట సీఐ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంకకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేశాడు. 2022లో కేసు నమోదు చేసిన కిర్లంపూడి పోలీసులు దర్యాప్తు చేసి చార్జిషీట్ కోర్టులో సమర్పించారు. శుక్రవారం రాజమండ్రి జువెనైల్ జస్టిస్ బోర్డు నిందితుడికి సంవత్సరం పాటు రోజూ 2 గంటలు కమ్యూనిటీ సర్వీస్ విధించాలని, బాలికకు రూ.2లక్షలు పరిహారం అందజేయాలని తీర్పు ఇచ్చారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు పుల్లేటికుర్రు విద్యార్థి



హర్షవర్ధని

అంబాజీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి చీకిరమిల్లి హర్షవర్ధని ఎంపికైనట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం బీర ధర్మరాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఏలూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -19 రన్నింగ్ పోటీల్లో హర్షవర్ధని 1500 మీటర్ల రన్నింగ్ విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీలు అందె సూర్యనారాయణ, డి.ఉదయభాస్కర్ తెలిపారు. ఈనెల 26 నుంచి హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్ఎంసీ చైర్మన్ నూకల రత్నమాల, ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు, కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, టీచర్లు అభినందించారు.

ముఖ్య గమనిక.. ఇళ్లకు రావద్దు!

- మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ప్రజాప్రతినిధులకు పోలీసుల ఆంక్షలు
- మన్యంలోకి రాకుండా అధికార పార్టీ ముఖ్య నేతలకు సూచనలు
- రేపు పెద్ద ఎత్తున నిరసనకు సిద్ధమైన మావోయిస్టులు
- ప్రతీకార చర్యలకు ఆస్కారం లేకుండా పెరిగిన పోలీస్ పహారా

రంపచోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో హిడ్మా, టెక్ శంకర్ వంటి కీలక నేతలతో పాటు 13 మంది మావోయిస్టులు మృతిచెందిన నేపథ్యంలో అల్లూరి జిల్లాలోని ప్రజా ప్రతినిధులకు మన్యంలో సంచరించకుండా పోలీసులు ముందు జాగ్రత్తగా ఆంక్షలు విధించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య హోదాల్లో ఉన్న నేతలెవరూ తమ నివాసాలకు రావొద్దని, మన్యానికి దూరంగా ఎక్కడైనా సురక్షిత ప్రాంతాల్లోనే ఉండిపోవాలని సూచించారు. అంతేకాకుండా వారి,వారి నివాసాల వద్ద నిఘాలను కూడా పెంచారు. వారు ఉండే ప్రాంతాల్లో పహారాను పెంచి భద్రత కల్పిస్తున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, ఎమ్మెల్సీ అనంతబాబుకు ఇక్కడి పరిస్థితులను వివరించి ఈ మేరకు పోలీసుల తగు సూచనలను చేశారు. అంతేకాకుండా అధికార కూటమి పార్టీలకు చెందిన ముఖ్య నాయకలు, కీలక నేతలకు సైతం తగు హెచ్చరికలు చేసి సురక్షితంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ రెండు ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు ఇప్పటికే కీలక ప్రకటనలను చేసి ఈ ఎన్‌కౌంటర్లను ఖండించారు. ఇవి బూటకపు ఎన్‌కౌంటర్లని, నిరాయుధులుగా ఉన్నవారిని పట్టుకుని తీసుకువచ్చి పోలీసులు కాల్చేశారని ప్రకటనలు విడుదల చేసిన మావోయిస్టులు ఈనెల 23న పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నారు. ఈ ఎన్‌కౌంటర్లపై వామపక్ష పార్టీలు కూడా తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించాయి. ఎదురవుతున్న వ్యతిరేకత, ఆందోళనల నేపథ్యంలో మావోయిస్టుల నుంచి ఏ ప్రతీకార చర్యలకు ఆస్కారం లేకుండా పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

కాకినాడ జీజీహెచ్‌లో సంఘటన



మల్లేశ్వరీ (ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో 8వ నెల గర్భిణి మరణించిన సంఘటన కాకినాడ జీజీహెచ్‌లో జరిగింది. మృతురాలి వదిన ధనలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామానికి చెందిన పెసంగి మల్లేశ్వరి (31) ప్రస్తుతం 8వ నెల గర్భిణి. తన వదిన ఏఎన్‌ఎం అయిన ధనలక్ష్మి సహాయంతో ఈనెల 14న జనరల్ చెకప్ నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు వచ్చింది. గైనిక్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అబ్జర్వేషన్‌లో ఉండాలని చెప్పడంతో యాంటీనేటల్ వార్డులో చేరింది. ఆసుపత్రిలో చేరే సమయంలో తనకు కొన్ని రకాల మందులు పడవని వైద్యులకు చెప్పగా ఆ సమాచారాన్ని కేస్‌షీట్‌లో పొందుపర్చారు. పడని మందుల్లో ప్యాంటో ప్రాజాల్ కూడా ఉంది. ఈ విధంగా చికిత్స జరుగుతున్న సమయంలో గురువారం మధ్యాహ్నం డాక్టర్ వచ్చి మల్లేశ్వరీకి ప్యాంటోప్రాజాల్ ఇంజక్షన్ ఇస్తుండగా అక్కడికి ధనలక్ష్మి చేరుకుని ఆ ఇంజక్షన్ పడదని అది ఇవ్వద్దని ప్రాధేయపడింది. కోపోద్రిక్తులైన డాక్టర్ బయటకు వెళ్లమంటూ ధనలక్ష్మిని తోసేశారు. అయితే ఇంజక్షన్ చేసిన కొద్ది సమయానికే మల్లేశ్వరీ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అనంతరం వైద్యులు మల్లేశ్వరీని జీసీయూకు తరలించారు. ఈ క్రమంలో 3 గంటలకు కడుపులో బిడ్డ చనిపోయిందంటూ మల్లేశ్వరీ కుటుంబీకులకు తెలిపారు. అనంతరం మల్లేశ్వరీ దేహంలో చలనం లేకపోయేసరికి వైద్యులు బీపీ చూడ డం, సీపీఆర్ చేయడం చేశారు. ధనలక్ష్మి డాక్టర్‌ను అడిగే సరికి బాగానే ఉంది అంటూ రాత్రి 11.30 వరకు వైద్యం చేస్తున్నట్టే నమ్మించారు. అనంతరం మల్లేశ్వరి చనిపోయిందని చెప్పారు. అయితే ఇంజక్షన్ ఇవ్వడంతోనే మల్లేశ్వరీ చనిపోయిందని, వైద్యులు ముందే చంపేసి ఇప్పుడే చనిపోయిందంటూ తప్పును కప్పిపుచ్చుకుంటున్నారని మృతురాలి కుటుంబీకులు విలపించారు. మృతురాలి బంధువులను వైద్యులు భయభ్రాంతులకు గురిచేయడంతో మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

బాలబాలాజీ ఆదాయం రూ.72.88 లక్షలు

మామిడికుదురు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి కార్తీకమాసం సందర్భంగా వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.72,88,637 ఆదాయంగా వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి




శ్రీనివాస్ (ఫైల్)

రావులపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవింగ్‌పై జీవనం పొందుతున్న ఆ ట్రాక్టరే డ్రైవర్ పట్ల మృత్యువైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ముమ్మిడివర్పాడుకు చెందిన అడపా శ్రీనివాస్(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం గడ్డిలోడు వేసుకుని వచ్చేందుకు బయలుదేరి వెళ్లాడు. భోజన సమయం కావడంతో ముమ్మిడివర్పాడు నుంచి పల్లిపాలెం వెళ్లే రహదారిలో మెరక ప్రాంతంలో ట్రాక్టర్‌ను నిలుపుదల చేసి ఆ చెంతనే ఉన్న హోటల్‌కు భోజనానికి వెళ్లాడు. ఆ సమయంలో ట్రాక్టర్ మెరక మీద ఉన్న కారణంగా ముందుకు కదులుతుండడంతో పరుగున వెళ్లి ఆపే ప్రయత్నం చేసేందుకు అక్కడికి వెళ్లాడు. ఇంజన్ స్టార్ట్ అవ్వడంతో వేగంగా ముందుకు వెళ్లింది. స్టీరింగ్ పట్టుకుని పైకి ఎక్కే సమయంలో కాలు జారి కింద పడిపోవడంతో ట్రాక్టర్ ఇంజన్ టైరు ట్రక్కు టైర్లు అతడి మీద నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి ఎస్ఐ చంటి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.



ఘటనా స్థలంలో ట్రాక్టర్

మోతుగూడెంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మోతుగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మోతుగూడెనికి విహారయాత్రకు వచ్చి ఈనెల 19న సాయంత్రం పొల్లుబ్రిడ్జి వద్ద ఈతకు వెళ్లి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన గనిశెట్టి జగదీశ్వరరావు (26) మృతదేహం శుక్రవారం లభ్యమైందని మోతుగూడెం ఎస్ఐ కె.సాధిక్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి తండ్రికి అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ నిబంధన శ్రీను, సన్నీ, సుబ్బా రావు తదితరులు ఉన్నారు.

దింపు కార్మికుడు మృతి

కాట్రేనికోన, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికుర్రులో శుక్రవారం దింపు కార్మికుడు కర్రి అప్పలరాజు మృతిచెందాడు. మెయిన్‌రోడ్డు పక్కన కొబ్బరిచెట్టు ఎక్కి దింపు తీస్తుండగా మేకు అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వచ్చేసరికే అప్పలరాజు మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు.పోలీసులు వివరాలు సేకరించారు.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన



పెద్దాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు వితరణ చేశారు.



జనసేనలో చేరిన వారితో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

'కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు'

పిఠాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తొలి నుంచీ కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. ప్రతి గ్రామం, పట్టణాల్లో వార్డుల నుంచి 5-10 మంది సభ్యులతో కమిటీల ఏర్పాటుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించిన జనసేన సమావేశాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. పిఠాపురం బైపాస్‌లోని రైస్‌మిల్లర్స్ కల్యాణ మండపంలో చివరిగా పట్టణంలోని 1 నుంచి 30 వార్డులకు చెందిన నాయకులు, జనసైనికులు, వీర మహిళలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వైసీపీ నుంచి పలువురు జనసేనలో చేరారు. వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా పిఠాపురంలో ఈ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యకర్తల అభిప్రాయాలు సేకరించామని, వాటిని పవన్‌కల్యాణ్‌ను ఫైవ్‌మెన్ కమిటీ సభ్యులు కలిసి నివేదిస్తారని తెలిపారు. పవన్ కార్యకర్తలతో నేరుగా కాంటాక్టులో ఉంటారని చెప్పారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రవాస్ యోజన'తో బీజేపీ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బోట్ క్లబ్ సమీపంలోని ప్రకృతి ఆశ్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ జిల్లా ప్రవాస్ యోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రవాస్ యోజన ఎంతో కీలకమన్నారు. గ్రామం, వార్డు స్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అన్నారు. పార్టీ బలం కార్యకర్తల ద్వారా ప్రజల్లో ప్రతిఫలిస్తుందని, అందరూ సమష్టిగా శ్రమిస్తే రాబోయే రోజుల్లో జిల్లాలో పార్టీ మరింత బలపడుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న, నాయకులు పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యనారాయణరాజు, యార్లగడ్డ రామ్‌కుమార్, యెనిమిరెడ్డి మాలకొండయ్య, ముత్తా నవీన్, గట్టి సత్యనారాయణ, కుండల సాయికుమార్‌యాదవ్, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'యాదవ సంఘం ఏర్పాటుకు కృషి'

పిఠాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐక్యత, సేవ, సంక్షేమమే లక్ష్యంగా పట్టణంలో యాదవ సంఘం ఏర్పాటు చేయాలని ఆర్ఆర్‌పార్కులో శుక్రవారం జరిగిన యాదవ ప్రముఖులు, సమన్వయకర్తల సమావేశంలో తీర్మానించారు. డిసెంబరు 14న యాదవ సంఘం కమిటీ ఏర్పాటుకు విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రతినిధులు తెలిపారు. యాదవులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సామాజికవర్గం సమన్వయకర్తలు కౌన్సిలర్ మరం లోవరాజు, గింజాల రామకృష్ణ, మొల్లి శివశంకరప్రసాద్, సతీష్, జోగా లోవరాజు, కుండల నాగసురేష్, మొల్లి కిషోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు

» కార్తీకానికి వీడ్కోలు.. మార్గశిరానికి స్వాగతం » పిఠాపురం పాదగయ, సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

» శివనామస్మరణతో దీపాలు వెలిగించి పుష్కరిణిల్లో వదిలిన భక్తులు

శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు పోలిస్వర్గం (పోలి పాడ్యమి) సందర్భంగా శివోహం అంటూ ఆవు నెయ్యితో అరటి దొప్పల్లో వెలిగించిన దీపాలను పాదగయ పుష్కరిణి, చెరువులు, కాలువల్లో, కోనేరుల్లో వదిలారు.

పిఠాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రం పోలి పాడ్యమి దీపాల వెలుగులను విరజిమ్మింది. కార్తీకానికి వీడ్కోలు పలుకుతూ మార్గశిరానికి స్వాగతం పలుకుతూ శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. మహిళలు, పురుషులు, చిన్నారులు పాడ్యమి దీపాలను ముందుగా నందీశ్వరుని వద్ద వెలిగించారు. తదనంతరం ఆవు నెయ్యితో వెలిగించిన దీపాలను అరటిదొప్పల్లో ఉంచి పుష్కరిణిలో వదిలారు. తులసి చెట్టు వద్ద, ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు పూజలు చేశారు. బ్రాహ్మణులకు దానాలు (స్వయంపాకం) ఇచ్చారు. పట్టణంలోని సోమేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాలకూ భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీతో పాదగయ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పోలీస్ స్టేషన్, పాదగయ సెంటర్ల వద్ద బారికేడ్లు ఏర్పాటుచేసి ట్రాఫిక్‌ను బైపాస్ మీదుగా మళ్లించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహన్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పోలి పాడ్యమిని పురస్కరించుకుని కుమారరామ భీమేశ్వరాలయం పరిసరాల్లో భక్తులు విశేష పూజలు జరిపారు. సామర్లకోట గోదావరి పుష్కరిణి, మాండవ్యనారాయణస్వామి పుష్కరిణి, హరిహర క్షేత్రం పుష్కరిణిలతో పాటు గోదావరి కాలువ వెంబడి హుస్సేన్‌పురం, వేట్లపాలెం, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లోని పుష్కరిణిల్లో మహిళలు అరటి దొప్పల్లో నేతితో చేసిన ఒత్తులను వెలిగించి పసుపు, కుంకుమలతో పూజించి నీటిలో వదిలారు. సామర్లకోట పట్టణం, మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో పోలి స్వర్గం సందర్భంగా అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ప్రత్యేక పూజలు జరిపారు. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లలితాదేవి, ఉమాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో ఉమారామలింగేశ్వరస్వామి





కాకినాడలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొండబాబు, పెద్దాపురంలో ప్రజాదర్బారు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ప్రజా దర్బార్లకు అర్జీల వెల్లువ

కాకినాడ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జగన్నాథపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్గా సెంటర్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బారులో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని ప్రజల నుంచి పలు ఫిర్యాదులను స్వీకరించారు. వినతిపత్రాలను పరిశీలించి, విచారణ అనంతరం పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అర్జీదారులకు హామీ ఇచ్చారు. కూటమి నేతలు కాకినాడ రామారావు, పాలకుర్తి శ్రీనుబాబు, సింగం అరవింద్‌కుమార్, కందుల విశ్వేశ్వరరావు, అరిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 31వ ప్రజాదర్బారుకు జిల్లా నలుమూలల నుంచీ అర్జీదారులు హాజరయ్యారు. కొవ్వాడ గ్రామానికి చెందిన పలువురు ఇరిగేషన్ కాలువ గట్టు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 20 అర్జీలు నమోదు కాగా వాటిలో ఎనిమిదింటిని ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సత్వరం పరిష్కరించేలా ఆయా శాఖల అధికారులతో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి సమీక్షించారు. కార్యక్రమంలో ఆనంద్ న్యూటన్, జున్నూరు బాబ్జీ, చింతపల్లి అర్జున్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాస బాబా, ముత్యాల అనిల్, కొండబాబు, పాలిక సతీష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు జీఎస్‌డబ్ల్యుఎస్ అదనపు కమిషనరుగా బాధ్యతలు



కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాస్‌కు జీఎస్ డబ్ల్యుఎస్ (గ్రామ /వార్డు సచివాలయ వ్యవస్థ) అదనపు కమిషనరుగా బాధ్యతలు అప్పగిస్తూ మున్సిపల్ శాఖ కమిషనర్, డైరెక్టర్ పి.సంపత్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించనున్న ఆయన త్వరలోనే విభాగ కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించాలని నిర్ణయించారు. సేవల అందుబాటు పెంపు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, పరిపాలనా సామర్థ్యాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని శ్రీనివాస్ చెప్పారు. విభాగ కార్యకలాపాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా, సేవల నాణ్యత పెరిగేలా కృషి చేస్తానని ఆయన చెప్పారు. శ్రీనివాస్‌కు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేషన్ కార్యదర్శిగా లక్ష్మి బాధ్యతల స్వీకారం



కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శిగా జి.లక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం మున్సిపాల్టీ మేనేజరుగా పనిచేస్తున్న ఆమెకు గ్రేడ్-3 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి కల్పించారు. బదిలీపై వచ్చిన లక్ష్మి ఇన్‌చార్జి కమిషనరు సుధాకర్‌ను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేసి బాధ్యతలు స్వీకరించారు.



'నేను నా ప్రయాణం' పుస్తకావిష్కరణ

కొత్తపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లికి చెందిన సినీ నటుడు, క్యారెక్టర్ ఆర్టిస్ట్ బత్తుల ప్రకాష్‌బాబు రాసిన 'నేను... నా ప్రయాణం' పుస్తకాన్ని ప్రముఖ సినీ దర్శకుడు తేజ గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. 2012లో విడుదలైన 'నీకు నాకు డాష్ డాష్' చిత్రం ద్వారా తనను వెండి తెరకు పరిచయం చేసిన తేజ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని ప్రకాష్ చెప్పారు.

'శ్రీప్రకాష్'లో రేపు స్కాలర్‌షిప్ పరీక్ష

పెద్దాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం, పరిసర ప్రాంతాల్లో 5, 6, 7, 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఆదివారం స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు శ్రీప్రకాష్ సినర్జీ స్కూలు డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ఉదయం 10 నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అందులో వచ్చిన మార్కుల ఆధారంగా నూరు శాతం వరకు ఫీజు రాయితీ ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 9247739333 నెంబరును సంప్రదించాలలని విజయప్రకాష్ కోరారు.





కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో పండుగప్ప చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

మత్స్యకారుల జీవనోపాధి పెంపునకు కృషి

కొత్తపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా తమిళనాడుకు చెందిన రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వాకల్చర్ నుంచి తీసుకొచ్చిన సుమారు 30వేల పండుగప్ప పిల్లలను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఉప్పాడ తీరంలో సముద్రంలోకి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఇండియన్ ఫాంపినో, టైగర్ రొయ్య పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. మత్స్యకారులకు జీవనోపాధి పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, జీజీహెచ్ డైరెక్టర్ రావు అక్షయ్, మత్స్యకార నాయకులు గంటా విజయకుమార్, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి రామకృష్ణ, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలిచిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. మత్స్యకారుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పాడ, కోనపాపపేట గ్రామాల్లో రక్షణ గోడ నిర్మాణ బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. మత్స్యకార నాయకులు సూరాడ రాజు, కొర్ని రమణ, మేరుగు సూరిబాబు, రాచపల్లి సనపయ్య, కంబాల వెంకటరమణ, చోడిపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు హృద్రోగ స్క్రీనింగ్ పరీక్షలు



జీజీహెచ్‌లో చిన్నారికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలకు గుండె వ్యాధికి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలను శుక్రవారం కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య బృందం నిర్వహించింది. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) లో భాగంగా విజయవాడ ఇండో బ్రిటిష్ హాస్పటల్ సౌజన్యంతో డాక్టర్ జ్యోతిప్రకాష్ బృందం జీజీహెచ్‌లోని పిడియాట్రిక్స్ విభాగ, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిచారు. హృద్రోగ అనుమానిత లక్షణాలున్న 37 మంది పిల్లలను పరీక్షించగా వారిలో 12 మంది పిల్లలకు గుండె వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. వారిలో ఐదుగురికి శస్త్ర చికిత్సలు అవసరమని మిగిలిన ఏడుగురికి మందుల ద్వారా నయమయ్యే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో వెల్లడించారు. వీరికి తక్షణం తగిన చికిత్స ఉచితంగా అందజేస్తామని ఇండో బ్రిటిష్ హాస్పిటల్ వైద్యులు వివరించినట్టు డీఎంహెచ్‌వో నరసింహ నాయక్ చెప్పారు. పిడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ డి.మాణిక్యాంబ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో దాడి ఘటనలో నిందితుడికి జైలు శిక్ష

గొల్లప్రోలు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీరు బాటిల్‌తో దాడి చేసిన నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.వెంకటఅపర్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం రాపర్తి గ్రామానికి చెందిన మహేంద్రవాడ వెంకటేష్ తన ఇద్దరు స్నేహితులతో గొల్లప్రోలు మండలం కొత్త వజ్రకూటం బయల్దేరారు. వన్నెపూడిలో మద్యం దుకాణం వద్ద ఆగగా కేహెచ్ పేటకు పి.సూరిబాబు, అతడి స్నేహితులు వెంకటేష్ తదితరులతో వాగ్వాదానికి దిగారు. వెంకటేష్‌పై బీరు సీసాతో దాడి చేసి గాయపరిచారు. దీనిపై గొల్లప్రోలు ఎస్‌ఐ శివకృష్ణ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. సూరిబాబుకు పది రోజులు జైలు శిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ అదనపు మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఏపీపీ జగదీష్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ లచ్చిబాబు సాక్షులను కోర్టులో హాజరుపరిచారు.

పిఠాపురం కోర్టు ఏజీపీగా మూర్తి



పిఠాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది పంద్రవాడ వెంకట శ్రీరామచంద్రమూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడు సంవత్సరాలు విధులు నిర్వర్తిస్తారు. పిఠాపురం బార్ అసోసియేషన్‌లో 30 సంవత్సరాలుగా న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న మూర్తిని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేరుగు రాజారావు, పిట్ల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు బంగారు రామకృష్ణ, కోశాధికారి రాజా, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు అభినందించారు.

శివస్వాముల నగరోత్సవం

పిఠాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శివస్వాముల నగరోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. శివమాల ధరించి దీక్షలో ఉన్న భక్తులకు ఉదయం ఇరుముడిధారణ జరిగింది. అనంతరం ఇరుముడి శిరస్సుపై ఉంచుకుని పురవీధుల్లో జరిగిన నగరోత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. శివనామస్మరణతో పట్టణం మార్మోగింది.

పోలీస్ స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



కాకినాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వన్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ జి.బిందుమాధవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి దైనందిన కార్యకలాపాలపై సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి సిబ్బంది పనితీరును పరిశీలించారు. వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలకు సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా సిబ్బంది పనితీరు ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులపై నిఘా ఉంచి ముందస్తు చర్యగా తహసీల్దారు వద్ద బైండోవర్ చేయించాలని సూచించారు. సైబర్ నేరం జరిగిందని ఇచ్చిన ఫిర్యాదుదారులతో సామరస్యంగా మాట్లాడి వారికి సరైన సలహా ఇచ్చి దిశానిర్దేశం చేయాలని సూచించారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పేకాట, కోడి పందేలు, అశ్లీలనృత్యాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సిబ్బంది వ్యక్తిగత సమస్యలను తనకు నేరుగా తెలియపరిస్తే తక్షణం పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎస్పీ చెప్పారు. ఆయన వెంట సీఐ ఎం.నాగదుర్గారావు, ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): సర్పవరం కూడలిలోని కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ బిందుమాధవ్ శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. పలు రికార్డులు, పెండింగ్ కేసులు, ట్రయల్‌లో ఉన్న కేసులు, ఎన్‌బీ వారెంట్లు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో రికార్డుల నిర్వహణ, ఎస్‌ఐలు, సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని, సామర్థ్యాలను మరింత పెంచుకోవాల్సి ఉందన్నారు. పెండింగ్ కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులపై సత్వరం చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. ట్రయల్స్ జరుగుతున్న కేసుల్లో నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐలకు సూచించారు. మరింత సమర్థంగా రికార్డుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ఎస్‌ఐలు వై.గణేష్‌కుమార్, వీరబాబు, తోట సునీత, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'నాగేశ్వరరావు సేవలు చిరస్మరణీయం'

కాకినాడ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎద్దు దేశస్థాయిలో చాంపియన్‌గా నిలిచేలా చేసి ద్రోణాచార్య కోడెగా అవార్డు పొందిన డాక్టర్ నాగేశ్వర రావు వాణిజ్యవేత్తగా, కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్‌గా కార్మికులకు, పేదలకు అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర బీసీ నాయకులు కుక్కల పోతురాజు, అల్లి రాజబాబు, మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కార్మిక నాయకుడు తాళ్లూరి రాజు పేర్కొన్నారు. శుక్రవారం డెయిరీఫారమ్ సెంటర్‌లో పీసీసీ సభ్యుడు పోతురాజు ఆధ్వర్యంలో నాగేశ్వరరావు 12వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు భారీ అన్నదానం చేశారు. పోర్ట్ ఎస్‌ఐ ఎ.సూర్యప్రకాష్, నాయకులు కోలా ప్రసాదవర్మ, పిల్లి చిన్న, దవులూరి ధనకోటి, కరుణాకరరెడ్డి, కోనాడ దుర్గాప్రసాద్, వనుం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కెరీర్‌పై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు తమ అభిరుచుల మేరకు కెరీర్‌పై సమగ్ర అవగాహన పెంపొందించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సెట్రాజ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు కోరారు. పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో వ్యక్తిత్వవికాసం, కెరీర్ అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థీ ఏదో ఒక అంశంలో అభిరుచి కలిగి ఉంటారని, దానిని గుర్తెరిగి క్రమశిక్షణతో పదో తరగతిలో ప్రతిభ చూపాలన్నారు. నేర్చుకున్న ప్రతి అంశం జీవితంలో ఏదో ఒక సమయంలో, ఏదో ఒక సందర్భంలో ఉపయోగపడుతుందని జగన్నాథరావు చెప్పారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

గండేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరిరోజు సందర్భంగా శుక్రవారం గండేపల్లి మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీనిలో భాగంగా మల్లేపల్లిలో అఖండ జ్యోతి వెలిగించి శివనామస్మరణంతో గ్రామమంతా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరికృష్ణసత్యరెడ్డి, ఏపీవో కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పించాలి



పీఎంజీపై పోస్టర్‌ను ఆవిష్కరించిన ఐటీడీఏ పీవో

రంపచోడవరం, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఇళ్ల రూఫ్ టాప్‌ల్లో సోలార్ సెట్లు ఏర్పాటు చేసుకునే వారికి రాయితీ ఇస్తామని ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన్ పథకం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లలో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకున్న వారికి మూడు విభాగాలుగా రాయితీలు పొందవచ్చని తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది ప్రతి గ్రామంలో పీఎం ఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.బి.రమణ, డీఈ మల్లికార్జునరావు, ఏఈలు శ్రీనివాసరావు, షాలెం రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలుచేయాలి

మారేడుమిల్లి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆహార మెనూను సక్రమంగాఅమలుచేయాలని ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని అందించాలన్నారు. వంటశాలను పరిశీలించి ఆహారాన్ని రుచి చూశారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కుమామిడికోట వారపు సంతను పరిశీలించారు. సంతల్లో నాణ్యత గల నిత్యావసరాలు విక్రయించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ చైతన్య, ఎంపీడీవో కిషోర్, ఆర్ఐ ఏసుబాబు పాల్గొన్నారు.

చదలవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోతుగూడెం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): చదలవాడ, గూడూరు, మోతుగూడెం గ్రామ పంచాయతీల్లో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బంది లేకుండా గోనెసంచులు, ధాన్యంలో తేమ శాతం చూడటానికి మైచార్ మీటర్ కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉంచామని చదలవాడ సర్పంచ్ కుంజా తిరుపతిరావు తెలిపారు. మధ్యవర్తులకు ధాన్యం విక్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలన్నారు. క్వింటాల్‌కు గ్రేడ్ ఎ రకానికి రూ.2389, సాధారణ రకానికి రూ.2369 ప్రభుత్వం మద్దతు నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరావు, నాయకులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

'మావోయిస్టుల పేరుతో వేధింపులు నిలిపివేయాలి'

దేవీపట్నం, నవంబరు21(ఆంధ్రజ్యోతి):మావోయిస్టుల పేరుతో అమాయక ఆదివాసీ, రైతు కూలీలపై వేధింపులు నిలిపివేయాలని రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు పార్టీని అంతం చేయడమేనని ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తూ మోడీ ప్రభుత్వం వందల సంఖ్యలో హత్యలు చేసిందన్నారు. హిడ్మాను చంపడం, మరో ఏడుగురిని కాల్చివేయడమే కాకుండా మరికొందరు అగ్రనాయకులు పోలీసు నిర్బంధంలో ఉన్నారన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో భయాందోళన సృష్టించడాన్ని రైతు కూలీ సంఘం ఖండిస్తుందని ఝాన్సీ పేర్కొన్నారు.

కోనలోవలో క్లీన్ అండ్ గ్రీన్

అడ్డతీగల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):కోనలోవ గ్రామంలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల కార్యదర్శులు,క్లాప్‌మిత్రలు, కమ్యూనిటీ రిసోర్సు పర్సన్లు హాజరై ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీ తయారుచేయడంపై అవగాహన కల్పించారు. పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మూడు టన్నుల చెత్తను సేకరించారు. డిప్యూటీ ఎంపీడీవో వై.గణేష్‌బాబు, సర్పంచ్ బి.అర్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం, (ఆంధ్రజ్యోతి): వై.రామవరంలో శుక్రవారం స్వచ్ఛాంధ్రలో భాగంగా ఎంపీడీవో బాపన్న దొర క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో పలు పంచాయతీల్లో పనిచేస్తోన్న క్లాప్‌మిత్ర లు, గ్రీన్‌గార్డులతో గ్రామంలో పలుచోట్ల చెత్తను తొలగించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అడ్డతీగల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డొక్కాపాలెంలో ఆంధ్ర వనవాసి కల్యాణ్ ఆశ్రమం ద్వారా స్థానిక హెల్త్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ పలువురికి వైద్య సేవలందించారు. గిరిజనులు మేకలు, కోళ్లు పెంచుకుని కల్తీలేని ఆహారం తయారుచేసుకోవాలని చెప్పారు. ముర్ల సత్యవతి, జగదీశ్వరి, అప్పారావు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్ పోలవరం నిర్వాసిత ఖాతాదారులకు ఊరట

కూనవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ పోలవరం నిర్వాసిత ఖాతాదారులకు ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు, అల్లూరి జిల్లాలో పోలవరం నిర్వాసితులకు ఈనెల2వ తేదీ నుంచి ఇళ్లకు సంబంధించిన పరిహారంనిర్వాసితుల ఖాతాలో జమ చేస్తుంది. అయితే బ్యాంకుల విలీనంతో సాంకేతిక సమస్య ఏర్పడటంతో ఆంధ్రప్రదేశ్‌గ్రామీణ బ్యాంకులోని ఖాతాదారులకు నగదుజమ ఆలస్యమైంది. అయితే శుక్రవారం ఏలూరుజిల్లా వేలేరుపాడు మండలానికి చెందిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు ఇద్దరు మహిళలకు బ్యాంకు ఖాతాలో పోలవరం ఇళ్లకు సంబంధించిన పరిహారం జమైంది. దీంతో ఆ బ్యాంక్ ఖాతాదారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈసమస్య పరిష్కారం కోసం ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ సతీష్‌చంద్ర తీవ్రంగా కృషిచేశారు. బుధవారం నుంచి అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ఉన్న పోలవరం నిర్వాసిత ఖాతాదారులకు డబ్బులు జమవడం మరింత వేగవంతమవుతుందని సతీష్‌చంద్ర 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో

కూనవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నర్సింగపేట బాలికల ఆశ్రమ పాఠశాలను చింతూరు ఐటీడీఏ పీవో శుభన్ నౌక్వాల్ సందర్శించారు. పాఠశాల తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, స్టోర్ రూమ్, టాయిలెట్ పారిశుధ్యం, సిక్ రూమ్‌లను పరిశీలించారు. 20మందిసిబ్బందికి 15మంది హాజరయ్యారు. 325మందికి 301మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల శ్రేయస్సు, శుభ్రత, పోషణ, చదువు ప్రమాణాల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థుల నుంచి పీవో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి

ఎటపాక, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):ఈనెల24న చింతూరులో నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎర్రబోరు గ్రామంలో ఐవీ అధ్యక్షతన కామ్రేడ్ ఇరపా శ్రీరాములు స్థూపంవద్ద ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీలు, పీడిత ప్రజల కోసం ఎర్ర జెండా అండగా పోరాడుతూ అమరులైన అమరవీరులను స్మరిం చుకుంటూ వారిత్యాగాలు, పోరాటాల గుర్తుగా చింతూరులో సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బుద్దల భద్రయ్య, సవలం రాము, హుస్సేన్ పాల్గొన్నారు.

రేఖపల్లిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

వీఆర్‌పురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వీఆర్.పురం, రేఖపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పారిశుధ్య కార్మికులతో కలసి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వీఆర్‌పురం, రేఖపల్లి, రాజుపేట గ్రామాల్లో చెత్తను సేకరించి ట్రాక్టర్లతో గ్రామ శివారులోని చెత్త షెడ్లకు తరలించారు. జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ 25మంది పారిశుధ్య కార్మికులకు కండువాలను అందించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, జడ్పీటీసీ సభ్యులు వాళ్ల రంగారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బొర్ర నరేష్‌కుమార్, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, ముత్యాల సిద్ధార్థ, బీరక సూర్యప్రకాశరావుపాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ప్రజాదర్బార్



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిలుస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. శుక్రవారం జగ్గం పేట క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలు హాజరై వినతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడు ముందుంటానన్నారు. ప్రజాదర్బార్ వేదికను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. జగ్గంపేట కార్యాలయంలో ప్రతీ శుక్రవారం ప్రజ సమస్యలపై ప్రజా దర్బార్ నిర్వహిస్తామని, కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలందరికీ తెలియజేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర టీం ద్వారా నియమించి ఎప్పటికప్పుడు జగ్గంపేట నియో జవర్గ సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మొత్తం 20 వినతులు ప్రజల నుంచి అందగా ఎమ్మెల్యే అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, కన్నబాబు, జనపరెడ్డి బాబు, బుర్రి సత్తిబాబు, నీలం శ్రీను, సుంకవిల్లి రాజు, పాండ్రంకి రాంబాబు, అనుకుల శ్రీకాంత్ , చింతల రవికాంత్ , కంచుమర్తి రాఘవ, చిట్యాల బాబ్జి, కందుల జమ్మి, మారిశెట్టి రాధా తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను పరిశీలించిన తుమ్మలపల్లి



సిబ్బందితో మాట్లాడుతున్న తుమ్మలపల్లి

జగ్గంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గురుకుల పాఠశాలను శుక్రవారం జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరిశీలించారు. పాఠశాలలో ఇటీవల జరిగిన ప్రమాద సంఘటనపై ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ దృష్టి తీసుకెళ్లి నిజనిజాలు తేల్చేలాగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరరావు, గంధం శ్రీను, కనకరాజు, గంధం వంశీ తదితరులున్నారు.

అన్నవరంలో వైసీపీ కోటి సంతకాల సేకరణ

అన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపుమేరకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ఆదేశాలతో మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంతో ఏర్పాటుచేయడానికి నిరసనగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని అన్నవరంలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం చేపట్టారు. కొండపల్లి అప్పారావు, దడాల సతీష్, బలువు మల్లేశ్వరరావు, గంపల సత్తిబాబు, సరమర్ల మదుబాబు, ఆశీన శ్రీను పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

తుని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగావ్యవసాయ శాఖ చేపడుతున్న అపరాల విత్తనాల పంపిణీ మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం హంసవరం, తిమ్మాపురం గ్రామాల్లో అపరాల విత్తనాల చిరు సంచుల కిట్‌లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకునేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించాలని సూచించారు. ఏఈవో దైవ ప్రసాద్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ లోవరాజు ఉన్నారు.



హంసవరంలో విత్తనాల పంపిణీ దృశ్యం

వనదుర్గ ఆలయంలో చండీహోమం



హోమ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఈవో సుబ్బారావు

అన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యనమలను కలిసిన ఖాదీ బోర్డు వైస్ చైర్మన్

తుని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు శుక్రవారం మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమలను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఖాదీ బోర్డు కార్యకలాపాలతో పాటు ఇతర అంశాలు చర్చించారు. యనమల మాట్లాడుతూ టీడీపీలో నిస్వార్థసేవలు అందించే నాయకులను అధిష్టానం గుర్తించి సముచిత గౌరవం ఇస్తుందన్నారు. టీడీపీ తుని మండలాధ్యక్షులు చింతమనీడి అబ్బాయి, సీనియర్ నాయకుడు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, దంతులూరి శ్రీనివాస రాజు తదితరులు ఉన్నారు.



యనమలను సత్కరిస్తున్న కన్నబాబు

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

తుని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తుని ఎంపీడీవో సాయి నవీన్ తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా డి.పోలవరంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం ప్రత్యేక ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించారు.



డి.పోలవరంలో స్వచ్ఛత కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది

జగ్గంపేటలో పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమం

జగ్గంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి జి.శివ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మంచినీటి చెరువు పరిసర ప్రాంతాలలో పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి 108 మంది పారిశుధ్య కార్మికులతో మంచినీటి చెరువు వద్ద ఉన్న చెత్తచెదారాలు, తుప్పలు తొలగింపు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి హాజరై పనులను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎక్కడైతే ఎక్కువ చెత్తచెదారాలు వంటివి ఉంటాయో అటువంటి ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, జగ్గంపేట మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మరియు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో మంచినీటి చెరువు వద్ద చెత్తను తొలగిస్తున్న దృశ్యం



ప్రొటోకాల్ పాటించడం లేదని పోడియం వద్ద ఎంపీటీసీల నిరసన

'ప్రొటోకాల్ విస్మరిస్తున్నారు'

మండల సమావేశంలో ఎంపీటీసీల నిరసన, వాకౌట్

ప్రత్తిపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎంపీటీసీలకు అధికారులు ప్రొటోకాల్ విస్మరిస్తున్నారని నిరసన వ్యక్తంచేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ లు ప్రొటోకాల్ అమలుపై నిరసన తెలిపి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సమావేశంలో పలువురు అధికారుల వారి శాఖల ప్రగతిని వివరించారు. హౌసింగ్ ఏఈ ఆనంద్ మాట్లాడుతుండగా ఎంపీటీసీలు అడ్డుతగిలి ప్రొటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం వెలిబుచ్చారు. వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్‌తోపాటు పిల్లా చిన్న, ఉమ్మిడి తాతీలు, తటవర్తి రామన్నదొర, సాధనాల అప్పారావు, మొల్లి వీరబాబు, జువ్వల సుజాత, మాకారపు షర్మిల తదితర ఎంపీటీసీలు గ్రామస్థాయిలో అధికారులు తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదన్నారు. అర్హులైన దరఖాస్తుదారులను సచివాలయాలకు ఆన్‌లైన్ కోసం పంపుతున్నా తిరిగి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కుమార్‌బాబు పరిస్థితిని చక్కదిద్దేందుకు యత్నించినా ఎంపీటీసీలు నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఏలేశ్వరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి రాజేష్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రతీ గ్రామంలో అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులతో సమీక్షించి గ్రామాల్లోని సమస్యలు పరిష్కంచాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులకు సూచించారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన 42 మంది ఉపాధ్యాయులు ఎంపీపీ బుజ్జిని కలిసి సత్కరించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో రవికుమార్ వర్మ, వైస్ ఎంపీపీలు సాదే లోవరాజు, చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, ఎంపీటీసీలు పసల సూరిబాబు, కొప్పుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ చైర్మన్‌ను కలిసిన గిరిజన నేతలు, ఉద్యోగులు

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన నేతలు

రౌతులపూడి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్ ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో త్వరలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి తెలిపినట్టు టీడీపీ నాయకుడు ఈగల సత్తిబాబు తెలిపారు. ఎస్టీ ఉద్యోగులు, రాష్ట్ర ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులతో కలసి కాకినాడలో చైర్మన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీ ఉద్యోగులు పి.సూరిబాబు, బి.నాగబాబు, పి.తరుణ్, పి.సాయి పాల్గొన్నారు.

కార్తీకానికి వీడ్కోలు

పుష్కరిణిలో దీపాలు వదలిన భక్తులు

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా భక్తి పారవశ్యంలో మునిగి తేలిన కార్తీక మాసానికి శుక్రవారం భక్తులు కార్తీక దీపాలు వదిలి వీడ్కోలు పలికారు. మండల వ్యాప్తంగా వేకువ జాము నుంచే గ్రామాల్లోని చెరువులు, పుష్కరిణిల వద్ద మహిళలు కార్తీక దీపాలు వదిలారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో మార్గశిర శుద్ధ పాడ్యమి సందర్భంగా మహిళలు కార్తీక మాస చివరి రోజు పూజల్లో పాల్గొన్నారు.

రాచపల్లిలో పోలిపాడ్యమి: మండలంలోని రాచపల్లిలో గంగామ్మ ఆలయం వద్ద శుక్రవారం పోలి పాడ్యమి వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. అమ్మవారిని వైసీపీ కోఆర్డినేటర్ ఎం.గిరిబాబు, నర్సాపురం వైసీపీ పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్, సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎస్.పెద్ద, సారిపల్లి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపాడ్యమి

ఏలేశ్వరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరిరోజును పురస్కరించుకుని శుక్రవారం పోలి పాడ్యమిని నిర్వహించారు. ఏలేరునదీ తీరాన ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు శివలింగానికి అభిషేకాలు చేశారు. మహిళలు ఏలేరునదిలో దీపాలను వదిలారు.

దీపాలు వెలిగించిన మహిళలు

రౌతులపూడి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగియడంతో రౌతులపూడి, మెరక చామవరంలోని శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఏటి కాలువ, ఏలేరు కాలువలో దీపాలు వదిలారు.

మంత్రి భరత్‌ను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి భరత్‌తో సమావేశమైన ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహార ప్రొసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌ను శుక్రవారం మంగళగిరి ఏపీఐఐసీ చాంబర్‌లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కలిశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పారిశ్రామికాభివృద్ధి వేగవంతానికి అవసరమైన చర్యలపై చర్చించారు. రాష్ట్ర సచివాలయంలోని హాల్-1లో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్ గౌరు చరిత రెడ్డితో కలిసి సత్యప్రభ పాల్గొన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యే ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రస్తుతం అమలులో ఉన్న వివిధ సంక్షేమ పథకాల అమలును వివరించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ప్రత్తిపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యపడుతుందని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు చెపారు. ధర్మవరం, రాచపల్లిలో ఆధ్యాత్మిక కేంద్రాలకు శుక్రవారం ఆయన ఆర్థికసహాయం చెక్కులను ఉత్సవ కమిటీలకు అందజేశారు. కార్యక్రమాల్లో అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నూకరాజు, కమిటీ సభ్యులు పెద్ద, గంగరాజు, అప్పలరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అల్లిపూడి దత్తతపై చర్చ

కోటనందూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అల్లిపూడి గ్రామాన్ని దత్తత తీసుకొనే విషయంపై శుక్రవారం తుని నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎన్.శ్రీధర్ అధికారులతో చర్చించారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే దివ్య సూచనలతో ముందుకు సాగుతామన్నారు. పీ4 లక్ష్యంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు.

ధర్మవరంలో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధర్మవరం గ్రామాన్ని విజబుల్ క్లీన్ విలేజ్‌గా గుర్తించి శుక్రవారం అధికారులు, మండల కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్‌గార్డులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో తడి, పొడిచెత్తలను వేర్వేరుగా సంపద కేంద్రానికి తరలించడంలో గ్రామస్థులు సహకరించాలని డీడీవో శ్యామల, ఎంపీడీవో కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, కార్యదర్శులు చెల్లుబోయిన వేణుగోపాల్, ఎం.లక్ష్మీనారాయణ, వెంకటరమణ, మధు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఏలేశ్వరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యమైన సమాజం సాధ్యమని ఎంపీడీవో రవికుమార్ వర్మ అన్నారు. శుక్రవారం యర్రవరంలో నిర్వహించిన పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. మండలంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి, గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, సెక్రటరీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

